నేనూ బెత్తం దెబ్బలు తిన్నవాడినే: సీజేఐ

న్యూఢిల్లీ, మే 5: ఇప్పుడంటే స్కూల్‌లో టీచర్ల వద్ద బెత్తాలు కనిపించడం లేదు. విద్యార్థులను బెత్తంతో దండించడం ఇప్పుడు నేరం. కానీ దశాబ్దాల క్రితం ఇది చాలా సర్వసాధారణ విషయం. బెత్తం దెబ్బలు తినని విద్యార్థి ఉండేవాడు కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కూడా ఇందుకు మినహాయింపేమీ కాదట. శనివారం నేపాల్ సుప్రీంకోర్టు 'జువైనల్ జస్టిస్'పై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని గుర్తుచేసుకున్నారు. స్కూల్లో ఓ చిన్న తప్పుకు బెత్తం దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఓ అసైన్‌మెంట్‌లో భాగంగా బొమ్మ తయారీ నేర్చుకుంటున్నప్పుడు సరైన సూదులు తెచ్చులేక దెబ్బలు తిన్నట్టు ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పుడు తాను ఐదో తరగతి చదువుతున్నానని, ఆ ఘటన ఇప్పటికీ తనకు గుర్తుందని తెలిపారు. 'చేతికి అయిన భౌతికగాయం మానిపోయింది. కానీ నా మనసుకు అయిన గాయం మాత్రం అలా ఉండిపోయింది. ఇప్పటికీ ఏదైనా పనిచేస్తున్నప్పుడు అది నాకు గుర్తొస్తుంది. ఇది పిల్లలపై లోతైన ప్రభావం చూపిస్తుంది' అని పేర్కొన్నారు.

ఏఎస్సైని ట్రాక్టర్‌తో తొక్కించి హత్య

షాదోల్ : బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు ఓ ఏఎస్సైని ట్రాక్టర్‌తో తొక్కించి చంపారు. ఈ ఘటన షాదోల్ జిల్లా బదోలి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఏఎస్సై మహేంద్ర బాగ్రి ఒకరిని అరెస్ట్ చేసేందుకు ఇద్దరు సహోద్యోగులతో కలిసి వెళుతుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్ వారికి ఎదురైంది. వాహనాన్ని ఆపాలని ట్రాక్టర్ డ్రైవర్ రాజ్ రావత్‌కు సూచించినా, ట్రాక్టర్‌ను ఏఎస్సై మీదుగా పోనిచ్చాడు. దీంతో బాగ్రి అక్కడికక్కడే మృతి చెందారు. ఆ తర్వాత నిందితుడు ట్రాక్టర్ నుంచి కిందకు దూకి పారిపోయాడు.

నీట్ పీజీలో 'సెక్షన్-టైమ్'

- ఫార్మాట్‌ను మార్చిన ఎన్‌బీఈఎంఎస్
- సెక్షన్ల వారీగా సమయం కేటాయింపు
- పలు ఇతర ప్రవేశ పరీక్షలకూ అమలు

న్యూఢిల్లీ, మే 5: నీట్ పీజీ-2024, జీపీఏటీతో సహా పలు ప్రవేశ పరీక్షల ఫార్మాట్‌లో నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఫర్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) కీలక మార్పులు చేసింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలో సెక్షన్ల వారీగా సమయం కేటాయింపు(టైమ్ బౌండ్ సెక్షన్స్) తప్పనిసరి విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకొన్నది. అంటే కొత్త విధానం ప్రకారం ప్రశ్నాపత్రాన్ని సెక్షన్ల వారీగా విభజించి.. ప్రతి సెక్షన్‌కు కొంత సమయం కేటాయించనున్నారు. ఆ సెక్షన్‌ను ఇచ్చిన సమయంలో పూర్తి చేసిన తర్వాతనే తర్వాతి సెక్షన్ ఓపెన్ అవుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహించే నీట్ పీజీతో సహా నీట్ ఎండీఎస్, నీట్ ఎస్ఎస్, ఎఫ్ఎంజీఈ, డీఎన్‌బీ పీడీసీఈటీ, జీపీఏటీ, డీపీఈఈ, ఎఫ్‌డీఎస్‌టీ, ఎఫ్ఈటీ పరీక్షల్లో ఈ కొత్త మార్పును తీసుకురానున్నట్టు ఎన్‌బీఈఎంఎస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎగ్జామినేషన్ ప్రక్రియ సమయంలో ఎదురవుతున్న పలు ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పరీక్షల భద్రత, ప్రాముఖ్యతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపింది.

ఒక సెక్షన్ పూర్తయిన తర్వాతే మరో సెక్షన్

కొత్త విధానానికి సంబంధించి ఎన్‌బీఈఎంఎస్ వివరణ ఇచ్చింది. ఉదాహరణకు నీట్ పీజీ-2024 పరీక్షను తీసుకొంటే, ప్రశ్నాపత్రంలో ఏ, బీ, సీ, డీ, ఈ అనే టైమ్ బౌండ్ సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో 40 ప్రశ్నలు, ఆ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు 42 నిమిషాల సమయం కేటాయించబడి ఉంటుంది. ఇచ్చిన సమయంలో ఆసెక్షన్‌పూర్తి చేసిన తర్వాతనే అభ్యర్థి తర్వాత సెక్షన్‌కు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఇలా ప్రతి సెక్షన్‌కు సమయం కేటాయింపు అనేది అమలవుతుంది. కేటాయించిన సమయం అయిపోయిన తర్వాత ఒక సెక్షన్‌లోని ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను మార్చేందుకు వీలు ఉండదు. ఇచ్చిన సమయంలో సంబంధిత సెక్షన్‌లో ఒక ప్రశ్నను రివ్యూ చేసుకొనేందుకు మార్కింగ్ ఆప్షన్ కూడా ఉంటుందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొన్నది.

నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్?

ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఖండించింది. పూర్తిగా అవాస్తమని పేర్కొన్నది. రాజస్థాన్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో హిందీ మీడియం విద్యార్థులకు ఇన్విజిలేటర్ పొరపాటున ఇంగ్లిష్ మీడియం ప్రశ్నాపత్రం ఇచ్చాడని, ఇన్విజిలేటర్ ఆ తప్పును సరిదిద్దే లోపే కొంత మంది విద్యార్థులు ప్రశ్నాపత్రంతో సహా బలవంతంగా ఎగ్జామ్ హాల్ నుంచి బయటకు వెళ్లిపోయారని ఎన్టీఏ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిందని, అప్పటికే దేశవ్యాప్తంగా అన్ని సెంటర్లలో పరీక్ష మొదలైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షా పత్రం లీక్ అనే ప్రస్తావనే ఉండదని ఆయన అన్నారు.

సీఐఎస్‌సీఈ 10, 12 పరీక్షల ఫలితాలు నేడు

కంపార్ట్‌మెంట్ ఎగ్జామ్స్ రద్దు

ఐసీఎస్ఈ 10, ఐసీఎస్ఈ 12 తరగతుల బోర్డ్ పరీక్ష ఫలితాల్ని 'ద కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్' (సీఐఎస్‌సీఈ) సోమవారం ప్రకటించబోతున్నది. '10, 12 తరగతుల బోర్డ్ ఎగ్జామ్స్ ఫలితాల్ని సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల చేస్తున్నాం' అని చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెక్రెటరీ జోసెఫ్ ఇమ్మానుయెల్ మీడియాకు తెలిపారు. బోర్డ్ వెబ్‌సైట్, కెరీర్స్ పోర్టల్, డిజీ పరీక్ష ఫలితాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అయితే ఈ సెషన్‌కు సంబంధించి 10, 12 తరగతుల కంపార్ట్‌మెంట్ పరీక్షలను బోర్డ్ నిలిపివేసింది. 'జూలైలో నిర్వహించే 'ఇంప్రూమెంట్ ఎగ్జామ్స్'తో గరిష్టంగా రెండు సబ్జెక్ట్స్‌లో విద్యార్థులు తమ మార్కులు లేదా గ్రేడ్స్‌ను మెరుగుపరుచుకోవచ్చు' అని ఇమానుయెల్ చెప్పారు.

ఉత్తరాఖండ్‌లో కార్ల వాషింగ్‌పై నిషేధం

నీటి కొరతతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

డెహ్రాడూన్, మే 5: ఉత్తరాఖండ్ తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నది. ఓవైపు ఎండలు మండిపోతుండటంతోపాటు మరోవైపు గత శీతాకాలంలో తక్కువ వర్షపాతం, హిమపాతం నమోదుతో నీటి సంక్షోభం తీవ్రమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నీటితో కార్లను కడుగటంపై నిషేధం విధించింది. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. అన్ని వర్క్‌షాపుల్లో నీటితో బదులుగా కార్లను డ్రైవాష్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

తాగునీటికీ ప్రజలు ఇబ్బందులు

వేసవి కాలంలో ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. డెహ్రాడూన్, నైనిటాల్, చంపావత్ సహా ఆరు నగరాల్లో తీవ్ర నీటి సంక్షోభం నెలకొన్నది. పలుచోట్ల ప్రజలు నీటి ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. 317 గ్రామాలు, 148 పట్టణ ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అర్వింగ్ హ్యాంకి వెల్లడించారు. హిమనీనదాలతోపాటు రాష్ట్రంలోని పలు ఇతర నదుల్లో కూడా నీటి ప్రవాహం తగ్గింది. ఈ నేపథ్యంలో పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు సూచించారు.

మంగళూరులో నీటి రేషనింగ్

మంగళూరు, మే 5: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో నీటి సంక్షోభం రోజురోజుకు ముదురుతున్నది. నీటి కొరతతో బెంగళూరు ఇప్పటికే అల్లాడుతుండగా, తాజాగా మంగళూరుకు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. నగరానికి ఏకైక నీటి వనరుగా ఉన్న తుంబే రిజర్వాయర్‌లో నీటి మట్టం భారీగా పడిపోయింది. దీంతో నగరంలో నీటి సరఫరా క్రమబద్ధీకరణ చేపట్టాలని జిల్లా అధికారులు, మంగళూరు నగర కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. నీటి రేషనింగ్ వ్యవస్థలో భాగంగా గృహ వినియోగ అవసరాల కోసం రెండు రోజులకు ఒక్కసారి మాత్రమే నీరు సరఫరా అవుతుందని అధికారులు పేర్కొన్నారు. నీటిని వృథా చేయొద్దని, అవసరమైన మేరకే నీటిని వినియోగించుకోవాలని సూచించారు. గార్డెనింగ్, వాహనాలను కడుగడం, ఇతర అత్యవసరం కాని పనులకు కుళాయి నీటిని వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మంగళూరు నగరం ఈ విధమైన నీటి సంక్షోభ పరిస్థితి ఎదుర్కోవడం గత ఐదేండ్లలో ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు.

పొట్టలో వృషణాలు

పురుషుడిగా తేలిన మహిళ!

బీజింగ్: కొన్ని రోజుల్లో పెండ్లి చేసుకోవాల్సిన ఆమె.. తన పొట్టలో వృషణాలున్నాయని తేలడంతో కంగుతింది. చివరికి ఆపరేషన్ ద్వారా వాటిని తొలగించుకొంది. చైనాలోని హుబీ ప్రావిన్స్‌లో ఈ వింత చోటు చేసుకొంది. సదరు యువతి పుట్టుకతో వచ్చే అడ్రినల్ గ్రంథి వ్యాధితో బాధపడుతున్నదని వైద్యులు తెలిపారు. ఆమెకు 18 ఏండ్లప్పుడు అసాధారణ హార్మోన్లు ఉన్నాయని తేలింది. ఆమె యవ్వనంలో అడుగు పెట్టినప్పటి నుంచి స్తనాల పెరుగుదల సరిగా లేకపోవడంతో క్రోమోజోముల పరీక్ష చేయించాలని వైద్యులు సూచన చేశారు. అయితే యువతి తల్లిదండ్రులు దాన్ని పెడచెవిన పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పెండ్లికి ముందు వైద్య పరీక్షలు చేయించడంతో తమ కూతురు పురుషుడన్న విషయం వారికి తెలిసి వచ్చింది.

సౌత్ ఈస్ట్ టెక్సాస్‌లో జలమయమైన ఒక ప్రాంతం

టెక్సాస్‌ను ముంచెత్తిన వరదలు

600 మందిని రక్షించిన సిబ్బంది

హ్యూస్టన్: అమెరికాలో నాలుగో అతిపెద్ద నగరమైన హ్యూస్టన్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల్లో చిక్కుకున్న సుమారు 600 మంది ప్రజలను సహాయ సిబ్బంది రక్షించారు. నాలుగు నెలల్లో కురువాల్సిన వానలు ఒక్కవారంలోనే పడటంతో నగరాన్ని వరదలు ముంచెత్తాయని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ఎలాంటి మరణాలు, ప్రజలు గాయపడినట్టు సమాచారం అందలేదని తెలిపారు. హ్యారిస్ కౌంటీలో 180 మందితోపాటు 122 పెంపుడు జంతువులను రక్షించినట్టు ఆ కౌంటీ జడ్జి తెలిపారు. పోల్క్‌కౌంటీలో 100 మందికిపైగా, మోంట్‌గోమెరికౌంటీలో 400 మందికిపైగా రక్షించినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. అనేక ప్రాంతాల్లో విద్యుత్తు వ్యవస్థ దెబ్బతిన్నది. లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తడంతో ఇండ్లను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

అమెరికాలో కొవిడ్ కొత్త వేరియెంట్ 'ఫ్లర్ట్'

న్యూఢిల్లీ: అమెరికాలో కొత్త కరోనా వేరియంట్ 'ఫ్లర్ట్' వేగంగా వ్యాపిస్తున్నది. ఇది రోగ నిరోధక శక్తికి లొంగకుండా తప్పించుకోగలదని నిపుణులు భావిస్తున్నారు. దీన్ని ఒమిక్రాన్‌లో సబ్ వేరియెంట్‌గా పేర్కొన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాల్లో 'ఐరిస్' వేరియెంట్ స్థానాన్ని 'ఫ్లర్ట్' భర్తీ చేస్తున్నదని నీకే బిర్లా దవాఖాన వైద్య నిపుణులు రాజీవ్ గుప్తా చెప్పారు. 'కొత్త వేరియంట్ వల్ల మరణాల రేటు మాత్రం తక్కువగానే ఉన్నది' అని గుప్తా అన్నారు. గొంతు నొప్పి, దగ్గు, తీవ్రమైన అలసట, జలుబు, తల నొప్పి, కండరాల నొప్పులు, రుచి, వాసన కోల్పోవటం వంటి రోగ లక్షణాలే 'ఫ్లర్ట్'లోనూ కనిపిస్తున్నాయి.

మాటలు రాని కొడుకును మొసళ్లకు విసిరేసింది!

బెంగళూరు: కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, దండెలి తాలూకాలో తల్లిదండ్రుల మధ్య ఘర్షణ ఆరేళ్ల బాలుడి ప్రాణాలను తీసింది. జన్మతః మూగవాడైన ఈ బాలుడిని కన్న తల్లి సావిత్రి (26) మొసళ్లు ఉన్న కాలువలో విసిరేసింది. 'మూగవాడిని ఎందుకు కన్నావు?' అంటూ తరచూ భార్యను భర్త రవి కుమార్ (27) వేధిస్తూ ఉండేవాడు. 'వాడిని పారేయ్' అని అనేవాడు. శనివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె తన కొడుకును తీసుకెళ్లి, కాలువలోకి విసిరేసింది. పోలీసులు ఆదివారం బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై తీవ్రమైన గాయాలు, మొసలి కొరికినట్లు గుర్తులు ఉన్నాయి. ఓ చెయ్యి కనిపించలేదు.

అల్ జజీరాపై ఇజ్రాయెల్ నిషేధం

టెల్ అవీవ్, మే 5: ఖతార్ దేశానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ అల్ జజీరాపై ఇజ్రాయెల్ ప్రభుత్వం వేటు వేసింది. తమ దేశంలోని అన్ని అల్ జజీరా కార్యాలయాలను మూసివేయాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయించినట్టు ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆదివారం ఎక్స్‌లో ప్రకటించారు. అయితే ఇది ఎప్పటి నుంచి అన్న విషయాలను వెల్లడించ లేదు. ఇజ్రాయెల్ నిర్ణయం అల్ జజీరాతో ఉన్న వైరాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ఛానల్ ఖతార్‌కు చెందినది కావడంతో ఆ దేశంతో సైతం ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే గాజాలో యుద్ధ నివారణకు జరిగిన మధ్యవర్తిత్వంలో ఖతార్ కీలక పాత్ర పోషించింది. కాగా, గాజాతో యుద్ధం సమయంలో అల్ జజీరా ఛానెల్ ఇజ్రాయెల్ ఊచకోతను హైలెట్ చేస్తూ ప్రసారం చేస్తుండేది.

చిత్రం

సూపర్‌స్టార్ ఇమేజ్‌కి భిన్నమైన కథతో

రజనీకాంత్ 'వేట్టయాన్' సినిమాకోసం ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బ్లాక్‌బాస్టర్ 'జైలర్' తర్వాత ఆయన పూర్తి స్థాయి హీరోగా నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్'. ఈ సినిమా గురించి ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న రానా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆయన తాజా ఇంటర్వ్యూలో 'వేట్టయాన్' గురించి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను భాగమైనందుకు చాలా ఆనందిస్తున్నాను. రజనీసార్‌తో నటించాలనే నా చిన్ననాటి కల ఇన్నాళ్లకు నెరవేరింది. దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ కథ చెప్పగానే షాక్ అయ్యాను. అద్భుతమైన కథ. తొలి సిట్టింగ్‌లోనే నన్ను ఇన్‌స్పైర్ చేశాడు. జ్యుడిషియల్ వ్యవస్థ నేపథ్యంలో సినిమా ఉంటుంది. ఎంతో పరిశోధించి జ్ఞానవేల్ చేసుకున్న స్క్రిప్ ఇది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇది రజనీ మార్క్ సినిమా కాదు. ఆయన ఇమేజ్‌కి పూర్తి భిన్నమైన కథ. అమితాబ్‌జీ కూడా ఇందులో భాగం కావడం, ఆయనతో కూడా నేను నటించడం నాకు డబుల్ బొనాంజా అన మాట. ఫహద్ ఫాజిల్ కూడా ఇందులో ఉన్నారు. షూటింగ్ చివరి దశకు చేరుకుంది. అక్టోబర్‌లో విడుదల అంటున్నారు. ఎప్పుడెప్పుడు చూస్తానా అని నాకూ ఆసక్తిగానే ఉంది.' అన్నారు రానా.

రాజమండ్రిలో గేమ్‌చేంజర్

'గేమ్‌చేంజర్' సినిమా విషయం ఎప్పటికప్పుడు కొత్త అప్‌డేట్లు వెలుగు చూస్తున్నాయి. సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉండటంతో గాసిప్పులు కూడా అదే స్థాయిలో హల్‌చల్ చేస్తున్నాయి. రీసెంట్ అప్‌డేట్ ప్రకారం ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో సోమవారం మొదలుకానున్నదట. ప్రధాన తారాగణం మొత్తం ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారట. కథ ప్రకారం ఇది కీలకమైన షెడ్యూల్ అని, ఈ షెడ్యూల్‌లోనే రామ్‌చరణ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని దర్శకుడు శంకర్ తెరకెక్కించనున్నారని సమాచారం. అంచనాలకు తగ్గట్టుగా భారీ వాణిజ్య విలువలతో రూపొందుతోన్న ఈ సినిమాలో రామ్‌చరణ్ తండ్రికొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. తండ్రి పాత్రకు జోడీగా అంజలి, కొడుకు పాత్రకు జోడీగా కైరా అద్వానీ నటిస్తున్నారు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నవీన్ చంద్ర ఇందులో కీలక పాత్రధారులు. తమన్ స్వరాలందిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా

మరో తెలుగు దర్శకుడితో?

తమిళ కథానాయకుడు ధనుష్ తెలుగు దర్శకులతో పనిచేయడానికి ఉత్సాహం చూపిస్తున్నాడు. మొన్నామధ్య వెంకీ అట్లూరితో 'సార్' చేశారు. పెద్ద హిట్ అయ్యింది. ప్రస్తుతం శేఖర్‌కమ్ములతో 'కుబేర' చేస్తున్నారు. ఆ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. తాజాగా మరో తెలుగు దర్శకుడికి ఆయన ఓకే చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ దర్శకుడి పేరు కిశోర్ బి. ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మించనున్నారనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. యువదర్శకుడు కిశోర్ ఇటీవలే సామాజిక అంశంతో కూడుకున్న ఓ కథను దిల్ రాజుకు చెప్పగా, ధనుష్‌కి ఈ కథ కరెక్ట్‌గా ఉంటుందని దిల్ రాజు భావించి, ధనుష్ వద్దకు ఈ కథను తీసుకెళ్లడం, ఆయనకు కూడా నచ్చడం జరిగిందని తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సివుంది.

అదేంటో ఇప్పుడే చెప్పను

పరిణితీ చోప్రా అమ్మకూచి. ఆమెకు తన తల్లి రీనా చోప్రా అంటే అపారమైన ప్రేమ. వారిద్దరి అనుబంధం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'అమ్మ నాకు మంచి ఫ్రెండ్. నాపై ఆమె చూపిస్తున్న ప్రేమను జీవితంలో మరిచిపోలేను. తనకెప్పుడూ రుణపడే ఉంటాను. మా అమ్మది చిన్నపిల్ల మనస్తత్వం. ఇప్పటికీ నేనే చాలా నేర్పుతుంటాను. కొన్ని సందర్భాల్లో నేను తల్లిగా, ఆమె కూతురిగా మారిపోతుంటాం. నాకు స్కూబా డైవింగ్ బాగా వచ్చు. అమ్మక్కూడా నేర్పించా. తను కూడా ఇప్పుడు బాగా స్కూబా ఆడుతుంది. అంతేకాదు, భౌతికంగా ఇద్దరం దూరంగా ఉన్నా. ఆన్‌లైన్‌లో కలిసే ఉంటాం. దూరంగా ఉండి కూడా గేమ్స్ ఆడుకుంటాం. ఈ నెల 12న మదర్స్ డే. ఆ రోజున అమ్మకు గొప్ప గిఫ్ట్ ఇవ్వబోతున్నాను. అదేంటో ఇప్పుడే చెప్పను.. సస్పెన్స్' అని చెప్పుకొచ్చింది పరిణితి చోప్రా.

నా పేరు వెనుక చాలా కథ ఉంది

'ప్రేమలు' సినిమాతో యువతరం అంతా మమిత ప్రేమలో పడిపోయారు. ఇన్‌స్టాలో ఆమె రీల్స్‌కి ఉన్న ఫాలోయింగ్ మామూలుగా లేదు. సోషల్ మీడియా సంచలనంగా మారింది మమిత. ప్రస్తుతం మలయాళంతోపాటు తమిళంలో కూడా సినిమాలు చేస్తున్నది మమిత. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో తన పేరుకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'నిజానికి నా పేరు నమిత. మమిత కాదు. నేను పుట్టినప్పుడు హాస్పిటల్ సిబ్బంది బర్త్ సర్టిఫికెట్‌లో నా పేరును మమితగా నమోదు చేశారు. నేను స్కూల్‌లో చేరేటప్పుడు ఈ పొరపాటు వెలుగుచూసింది. ఇంట్లో అందరూ షాక్. ఇక చేసేది లేక మమితగానే స్కూల్లో జాయిన్ అయ్యాను. మమిత అంటే మిఠాయి అని అర్థం.' అంటూ చెప్పుకొచ్చింది మమిత. ఇంకా చెబుతూ 'ప్రేమలు' నా తొలి సినిమా అని అందరూ అనుకుంటున్నారు. నిజానికి అది నా పదహారో సినిమా. మలయాళంలో ఇప్పటికే చాలా సినిమాలు చేశాను.' అని అందంగా నవ్వేసింది మమిత.

ప్రేమ పాఠశాల

నవీద్‌ఖాన్, స్నేహ శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ది స్కూల్'. 'ప్లేస్ ఆఫ్ లెర్నింగ్' అనేది ఉపశీర్షిక. వాల్మీకి దర్శకుడు. శివ రెమిడాల నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి టీఎఫ్‌సీసీ మెంబర్ పద్మిని నాగులపల్లి కెమెరా స్విచాన్ చేసి యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. సహజత్వం ఉట్టిపడేలా సినిమాను తీయగల దర్శకుడు వాల్మీకి అని, వాస్తవసంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కచ్చితంగా విజయాన్ని సాధిస్తుందని హీరో నవీద్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా దర్శక, నిర్మాతలు కూడా మాట్లాడారు. ఇంద్రజ, కృష్ణభగవాన్, రాజారవీంద్ర, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ ఠాకూర్. మాటలు, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం: వాల్మీకి.

రాజు యాదవ్ జరిగిన కథ

గెటప్‌శ్రీను హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణ మాచారి దర్శకుడు. కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మాతలు. ఈ నెల 17న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. తేజ సజ్జా ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. సినిమా మంచి విజయం సాధించాలని యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు అందించారు. సినిమాకు అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, సాంకేతికంగా అన్ని విభాగాలూ అద్భుతంగా ఉంటాయని, నిర్మాతలు సినిమాను ప్రేమించి నిర్మించారని గెటప్ శ్రీను అన్నారు. 'ఇది జరిగిన కథ. జీవితాన్ని చూస్తున్నట్టే సినిమా ఉంటుంది. ఇందులో ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి. 17న రానున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచడం ఖాయం' అని దర్శకుడు నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాణం: సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్టైన్మెంట్స్.

అమ్మ కోసం చెబుతున్నా..

తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లాలో ఉన్న శ్రీరంగాపూర్ రంగనాథస్వామి దేవాలయంలో మార్చి 27న గుట్టుచప్పుడు కాకుండా హీరో సిద్దార్థ్‌తో నిశ్చితార్థం కానిచ్చేసింది తెలంగాణ అమ్మాయి అదితిరావు హైదరీ. మీడియా పుణ్యమా అని ఆ విషయం అందరికీ తెలిసిపోయింది. అయితే.. 35రోజుల తర్వాత తన నిశ్చితార్థం గురించి మీడియాతో మాట్లాడింది అదితీరావు. 'జీవితంలో జరిగే ముఖ్య ఘట్టాలని గుర్తుండిపోయేలా చేసుకోవాలి అనేది నా అభిమతం. అందుకే నా కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉన్న వనపర్తిలోని 400ఏళ్ల రంగనాథస్వామి టెంపుల్‌లో నిశ్చితార్థం చేసుకున్నాను. సిద్దార్థ్‌కూడా నా అభిమతాన్ని గౌరవించారు. ఇప్పుడు ఈ విషయం మీడియాకు ప్రత్యేకంగా చెప్పడానికి కారణం మా అమ్మ. నా నిశ్చితార్థం విషయం బయటకు పొక్కడంతో అమ్మకు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయట. అమ్మ అందరికీ సమాధానం చెప్పలేక 'దయచేసి నీ ఎంగేజ్‌మెంట్ విషయం మీడియాకు చెప్పు' అని కోరింది. దాంతో నేనూ, సిద్దార్థ్ మా ఫొటోలను పోస్టులు పెట్టాం. కేవలం మా శ్రేయోభిలాషులు మాత్రమే ఈ వేడుకలో పాల్గొన్నారు. పెళ్లి గురించి తర్వాత చెబుతా' అని తెలిపింది అదితీరావు.